అల్లుడు

శ్రీమతి దాసరి శారద, బి. ఏ.

"అల్లుడు గదాయని నెత్తిని ఎక్కించుకుంటే మమ్మల్ని యిలా వేధించుతున్నాడేమిటండీ?" అన్నది జానకమ్మ సరస్వతమ్మతో.

"ఎవరి సంగతండీ! మీ అల్లుడుగారేనా?" అన్నది సరస్వతమ్మ సంగతి తెలుసుకోవాలనే కుతూహలంతో

"మా అల్లుడుగాక యింకెవరండీ! ఆయనే 'జామాతా దశమో గ్రహః' అన్నట్లు తయారయాడంటే నమ్మండి." అన్నది జానకమ్మ అల్లుడుగారి ఆటల్ని భరించలేక బయటపెడ్తూ.

"అసలు ఏమిజరిగిందో చెప్పండి." అన్నది సరస్వతమ్మ కథా ప్రారంభాన్ని తెలుసుకోవాలనే ఉత్సాహంతో

"మొన్న సైకిలు కొనిపెట్టామా—యీ వేళ వాచీ కావాలంటున్నాడండీ — వాచీ" అన్నది జానకమ్మ పళ్లు పటపట కొఱుకుతూ.

"అలా తిప్పలు పెట్టే ఎలాగండీ. ఎలాగో సర్దుకోవాలిగాని." అన్నది సరస్వతమ్మ.

"మీకేం తెలుసండీ! రోజూ మేము పడుతున్న తిప్పలు ఆ భగవంతుడికి తెలుసు. అనుభవిస్తున్న మాకు తెలుసు." అన్నది జానకమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ.

◆ ◆ ◆

రాఘవయ్యగారు మధ్యతరగతి కుటుంబీకుడు. ఆ సంపాదించేదేదో పొట్టకూ బట్టకూ సరిపోతుంది. పిల్లా జల్లా ఎక్కువగా లేరు — ఒక సరోజతప్ప. ఆ పిల్లగూడ రాఘవయ్యగారూ జానకమ్మా ఎన్నో నోములు నోచిన తరువాత పుట్టింది. అందుచేత కంటికి రెప్పలా కాపాడి పెంచారు ఆదంపతులు. సరోజ అని పేరు పెట్టి ముద్దుగా పిలుచుకొనేవారు.

రాఘవయ్యగారు కొంచెము పూర్వాచారపరాయణుడనే చెప్పాలి. అందుచేత సరోజకి ఆరవక్లాసుతోనే చదువు మాన్పించారు. ఈడువచ్చిన పిల్లకి పెండ్లిచేయకుండా వుండకూడదని జానకమ్మ తొందర పెట్టింది.

రాఘవయ్యగారు అల్లుడ్ని వెదకటానికి కాలికి బలపము కట్టుకొని తిరిగారు. ఎక్కడబట్టినా పది వేలూ — ఐదువేలూ కట్నాలడుగుతున్నారు. పాపం రాఘవయ్యగారు చమటోడ్చి సంపాదించిందంతా కలిపినా రెండువేలు దాటవు. అలాంటప్పుడు అల్లుడ్నెలాకొనగలడు?

చివరకు చీరాలలో ఒక సంబంధము కుదిరింది. అదీ ఒక పాతస్నేహితుడు తటస్థపడటముచేత కుదిరింది. చీరాలలో రాఘవయ్యగారి బాల్యమిత్రుడు చంద్రయ్య వ్యవసాయము చేసుకొని బ్రతుకుతున్నాడు. ఆయనకు సంతానం ఐదుగురు. ముగ్గురాడపిల్లలు — యిద్దరు మగపిల్లలు. పెద్దకొడుకు శేషగిరిరావు స్కూలు ఫైనలు వఱకు చదివి పనీపాటా లేకుండా తిరుగుతున్నాడు. ఏదన్నా పనిలో చేరమని చంద్రయ్య రాత్రింబగళ్ళు బ్రతిమిలాడి చెప్పాడు. కాని శేషగిరిరావుకదేమీ తలకెక్కలా. ఎంతో ఆలోచించిన మీదట చంద్రయ్య ఒక నిశ్చయానికి వచ్చాడు. అదేమిటంటే శేషగిరిరావుకి పెండ్లి చేస్తేనన్నా పెళ్ళాన్ని పోషించడానికయినా పనికి పోతాడని. కాని పెళ్ళంత త్వరగా అయేపనా? ఆడపిల్లనిచ్చే వాళ్ళు ఎన్నివిధాల ఆలోచిస్తారు? పనీ పాటా లేకుండా బిక్కాఫకీరులా రోడ్లు వెంట తిరిగే శేషగిరిరావుకి చంద్రయ్య అనుకున్నంత

త్వరగా పెళ్ళి కుదురలేదు. ఆ విధంగా రెండేళ్ళు గడిచినయ్. చివరికి రాఘవయ్యగారు ఇటస్థపడ్డారు. ఆయన తన కష్టాలు చెప్పుకొని కట్నాల ధరలు పెరగటంవల్ల తమ సరోజకి పెళ్ళికావటములేదని విలపించారు. చంద్రయ్య అంతావిని మూడువేల రూపాయిల్లోనయితే తన కొడుక్కి చేసుకుంటానన్నాడు. రాఘవయ్యగారు సంతోషంతో 'అలాగే'నన్నారు.

ఎలాగయితేనేం రాఘవయ్యగారు తాముకూడ బెట్టిన డబ్బుకి జానకమ్మగారి నగలు అమ్మగావచ్చిన డబ్బుకలిపి మూడువేలూ ముట్టజెప్పి మూడుముళ్ళూ వేయించి సరోజ పెళ్ళి అయిందనిపించారు.

♦ ♦ ♦

పెళ్ళి జరిగి ఏణ్ణార్థం అయింది. ఈ మధ్య ఎన్నో మార్పులు వచ్చినయ్. శేషగిరిరావుకి పాతికేళ్ళు నిండినా పనిమాట పట్టించుకోవటములేదు. చంద్రయ్య నయానా చెప్పిచూచాడు భయానా చెప్పిచూచాడు కానీ ఏమాత్రమూ ప్రయోజనములేకపోయింది. శేషగిరిరావు చిన్నతనంలోనే లెటుమతంగా వుండేవాడు. ఇహ యిప్పుడు తండ్రిమాటవింటాడా? మొక్కైవంగనిది మ్రానైవంగుతుందా? చంద్రయ్యకి విసుగుపుట్టింది. "అడ్డాలలోనే బిడ్డడుగాని గడ్డాలు వచ్చాక బిడ్డడా?" అని అనుకున్నారు.

♦ ♦ ♦

రాఘవయ్యగారు సరోజని తీసికొని వెళ్ళమని వియ్యంకుడికి ఉత్తరము వ్రాశారు. చంద్రయ్య "కొడుక్కే పెట్టలేక అవస్థపడుతుంటే యింకాపైగా కోడలికి ఎక్కడ్నుంచి తెచ్చి పెట్టేది" అనుకున్నాడు. చంద్రయ్య బాగా ఆలోచించి రాఘవయ్యగారికి కబురుచేశారు. ఏమనంటే — "మీ అల్లుడికి మీరే ఏదైనా ఉద్యోగము చూపించుకోండి లేకపోతే అమ్మాయిని యిక్కడికి తీసుకురావడానికి వీలుపడదు." అని.

ఉత్తరము చదువుకొని రాఘవయ్యగారు నిర్ఘాంతపోయారు. మూడువేలూ పోసికొన్నదిగాక యింకా అల్లుడికి ఉద్యోగము ఎక్కడ చూపించగలడు? అందులో యీ 'సిఫారసు'ల యుగంలో పని దొరకటం మాటలా?

రాఘవయ్యగారు జానకమ్మను పిలచి వియ్యంకుడు వ్రాసిన ఉత్తరము చదివి వినిపించారు. జానకమ్మ విని ముక్కుమీద వేలు వేసుకున్నది. "ఏమైనాసరే అనుభవించక తప్పుతుందా?" అనుకొని భర్తతో "సరే ఏమిచేస్తాము? అల్లుడుగార్ని పిలిపించండి. అమ్మాయిని వాళ్ళు తీసుకువెళ్ళనప్పుడు మరి మనమే అబ్బాయిని తెచ్చుకుందాము. మీరే ఏదో ఒక పని చూపించండి. తప్పుతుందామరి" అన్నది జానకమ్మ.

"నేనూ అదే అనుకుంటున్నాను. మనము వాళ్ళకన్నా తగ్గివుండాల్సిందే మరి. ఇచ్చినవాడు ఈగ - పుచ్చుకున్నవాడు పులి" అన్నారు రాఘవయ్యగారు.

మరునాడు రాఘవయ్యగారు వియ్యంకుడికి శేషగిరిరావుని పంపవలసినదని ఉత్తరము వ్రాశారు.

ఉత్తర మందిన మూడో రోజు శేషగిరిరావు అత్తగారింట్లో హాజరయినాడు. అల్లుడికి జరుగవలసిన మర్యాదలన్నీ యథా ప్రకారంగా జరిగిపోయినయ్.

పదిహేను రోజులు గడచిపోయినయ్. రాఘవయ్యగారు సరోజపెళ్ళి కుదర్చటానికి ఎంత కష్టపడ్డారో అంతకు రెట్టింపుగా శేషగిరిరావు ఉద్యోగముకోసము కష్టపడ్డారు. చివరకు 'డిస్ట్రిక్టు బోర్డు'లో గుమాస్తాపని ఖాళీగా వుందని తెలిసింది. శేషగిరిరావుని పిలిపిస్తే 'ఇంటర్వ్యూ' చేసి పనియిస్తామన్నారు. రాఘవయ్యగారు చాల సంతోషించారు. కూతురూ - అల్లుడూ తమ కళ్ళ ఎదుట వుంటారని సంతోషించారు.

ఇంటికి తిరిగివచ్చి శేషగిరిరావుకి ఉద్యోగము దొరికిందని చెప్పారు. శేషగిరిరావు "ఆ! గుమాస్తాపని ఎవరుచేస్తారు" అని తిరస్కరించాడు.

రాఘవయ్యగారు ఏమీ చేయలేక ఊరుకున్నారు కొన్నిరోజులు గడచిపోయినయ్.

ఒక రోజు శేషగిరిరావు 'సినిమా' నుండి వచ్చి 'సరో ! సరో' అని భార్యను పిలిచాడు.

"ఏమిటండీ !" అన్నది సరోజ.

"మరేమీలేదుగాని నేనొకటి అడుగుతాను. మరి మీనాన్నకి చెప్పి ఒప్పిస్తావా ?" అన్నాడు శేషగిరిరావు.

"ఏదో ప్లాను వేశారే ! సరే ఏమిటో చెప్పండి" అన్నది సరోజ.

"ఆ ! ఏమీలేదు. ఒక రేడియో కొనమని చెప్పు. నిద్దరికీ కాలక్షేపంగా వుంటుంది." అన్నాడు శేషగిరిరావు.

"రేడియోకే పెట్టారూ - బాబోయ్! రేడియో కొనటమంటే మాటలా ?" అన్నది సరోజ.

"ఏం? రేడియో అంటే వేలు చేస్తుందనుకున్నావా" అన్నాడు శేషగిరిరావు.

"అల్లుడంటే వేలు చేసినా కొంటారుగాని రేడియోగూడ వేలుచేస్తే ఎవరుకొంటారులెండి !" అన్నది సరోజ వ్యంగ్యంగా.

"ఆ! మాటలు నేర్చావే? నన్నేగా నీవు ఎత్తిపొడుస్తున్నది." అన్నాడు శేషగిరి కొంచెం కోపంగా.

"ఎందుకండీ ! గుమ్మడికాయ దొంగెవరంటే భుజాలు తడుముకుంటారు." అన్నది సరోజ నవ్వుతూ.

"ఇంతకీ నేనడిగింది మీనాన్నకి చెప్తానంటావా? లేదా ?" అన్నాడు శేషగిరిరావు బెదరిస్తూ.

"అలాగేనండీ! 'ఆ కిష్కింధ సామ్రాజ్యానికి సుగ్రీవునాజ్ఞ' ఈ గృహసామ్రాజ్యానికి మీయాజ్ఞ." అన్నది సరోజ లోపలికి వెళ్తూ.

మర్నాడు సరోజ తండ్రితో రేడియోవిషయము చెప్పింది. రాఘవయ్యగారు యింతవరకూ పేపరు గూడ లైబ్రరిలోనే చదువుకునేవారుగాని డబ్బుపెట్టి కొనుక్కునేవారు కారు. కాని అల్లుడువచ్చిన దగ్గఱనుండి పేపరు కొంటున్నారు. కాని అల్లుడు రేడియో కొనమని కూర్చున్నాడు. సరే అల్లుడి కోరిక తీర్చవద్దా అనుకొని మూడువందలు పెట్టి రేడియో కొన్నారు - రాఘవయ్యగారు.

రేడియో కొన్నదగ్గఱనుండి శేషగిరిరావు ఒకటే పెట్టటం. రేడియోవారు కొన్నిగంటలు విశ్రాంతి యిచ్చారుగాని లేకపోతే శేషగిరిరావు రోజంతా పెట్టేవాడే. ఈ విశ్రాంతి సమయంలో శేషగిరిరావు సినిమా పత్రికలు చదువుతూవుండేవాడు. మళ్ళీ కాఫీ - అదీ త్రాగి కాస్త అటూ – యిటూ తిరిగేటప్పటికి సినిమాటయిమయేది. ఈ విధంగానే శేషగిరిరావుకి కాలముగడచిపోతుంది.

సాయంకాలం రాఘవయ్యగారు స్కూలునుండి అలసిపోయి యింటికివచ్చేటప్పటికి శేషగిరిరావు షోగ్గా తయారయి భార్యసమేతంగా సినిమాకు పోయేవాడు.

ఒక రోజు రాఘవయ్యగారు భార్యనుపిలచి "సరోజ ఏదే ?" అన్నారు.

"అల్లుడుగారు సినిమాకు పిలుచుకువెళ్ళారండీ. ఇంకేంపనుంది." అన్నది జానకమ్మ విసుగ్గా.

"తిన మరిగిన కోడి యిల్లెక్కికూసిందట. అలా వుంది యీయనగారి సంగతి. ఎంత అల్లుడయితే మాత్రం ? ఎప్పుడూ సినిమాలకూ సర్కసులకుతిరక్కపోతే ఏదో తగ్గపని చూచుకోకూడదూ. నాకేమో రెక్కాడితేగాని డొక్కాడదాయె. మనమేమైనా జమిందారులమా ఏమిటి - అల్లుణ్ణి ఎల్లకాలము కూర్చోబెట్టి మేపటానికి." అన్నారు రాఘవయ్యగారు కోపంగా.

"ఇంక విచారించి లాభమేమిటి ? చేసుకున్నవాడికి చేసుకున్నంత." అన్నది జానకమ్మ.

ఇంతలో పొరిగింటి పార్వతమ్మ సూదిదారము కోసం రావటముతో వారి సంభాషణ ఆగిపోయింది. మరో రెండు నెలలు దొర్లిపోయినయ్.

శేషగిరిరావు తిరగటానికి కాళ్ళు నొప్పిగా వున్నయి కాబోలు సైకిలు కావాలని మామగారిని అడిగాడు. ఈయనగారి 'హిరణ్యాక్షవరాలు' తీర్చేటప్పటికి మామగారి తలప్రాణం తోకకివచ్చేది. ఏమైనా తప్పుతుందామరి! అలాగే అప్పో సప్పో చేసి అల్లుడిని తృప్తి పరిచారు రాఘవయ్యగారు.

ఒకరోజు జానకమ్మ యింటికి శ్యామలమ్మ వచ్చి మాటల సందర్భంలో "మీ అల్లుడుగారేమి చేస్తున్నారండీ" అని ప్రశ్నించింది.

జానకమ్మ "ఆయనకు పనీలేదూ - పాటాలేదూ. ఊరికినే తిని తిరుగుతుంటాడు." అన్నది.

"అలాగయితే ఎలాతోస్తుందండీ," అన్నది శ్యామలమ్మ

"తోచక ఏమిచేస్తుందండి. రేడియోవుండె, పార్కువున్నదాయె. సినిమాలు - పుస్తకాలు - సైకిలు... యిన్నివుంటే తోచక పోవటమేమిటండీ." అన్నది జానకమ్మ.

"బాగా చెప్పారు. ఇలాగయితే కాపురం చేసినట్లే. అందరిండ్లలో మగవాళ్ళు లేరండీ! ఇలాగే వున్నారా? ఉద్యోగము పురుషలక్షణమని ఊరికినే చెప్పారా మనపెద్దలు." అన్నది శ్యామలమ్మ.

"అది లోకంలో జరిగేసంగతి-నిజమే. కాని మా అల్లుడు అలా కాదండోయ్. అదేమిదేమంటే అలక పాన్పు ఎక్కి కూర్చుంటాడు." అన్నది జానకమ్మ.

ఇంతలో రాఘవయ్యగారు వచ్చారు. శ్యామలమ్మ వెళ్ళిపోయింది. ఆవేళ మధ్యాహ్నం రెండు గంటలకు జానకమ్మ పొరిగింటికి వెళ్ళింది. రాఘవయ్యగారు ఏదో పనిమీద బయటకు వెళ్ళారు. సరోజ బియ్యంలో రాళ్ళు ఏరుతుంది. శేషగిరికి ఏమీతోచటంలేదు. చివరికి 'సరో' అని భార్యని పిలిచాడు.

"ఏమిటండీ పిలచారు." అని బియ్యంచేటతోనే వచ్చింది సరోజ.

"ఆ! ఏమీలేదుగాని ఆ చాట అక్కడ పెట్టి యిలారా." అన్నాడు శేషగిరిరావు.

సరోజ తప్పనిసరిగా చాట చివరగదిలో పెట్టి వచ్చింది.

"ఇప్పుడు టైమెంతవుతుంది?" అన్నాడు.

"షుమారు రెండవుతుందండీ." అన్నది సరోజ.

"సరేగాని మీ యిల్లు యింత పురాతనంగా వుందేం? మనుష్యులు మరీను. ఇల్లన్నాక ఒక గడియారముగూడాలేదాయె." అన్నాడు శేషగిరిరావు క్రొత్తకథను ప్రారంభిస్తూ.

"మా నాన్న ఎండని బట్టే గంట తెలుసుకుంటారండి! అలాంటప్పుడు గడియారము అవసరమేముందండీ." అన్నది సరోజ.

"మీనాన్నకి అవసరము లేకపోవచ్చు - అలా అని నాకుగూడా అవసరములేదంటావా?" అన్నాడు శేషగిరిరావు తీవ్రంగా.

"అయితే మీరనేదేమిటండీ!" అన్నది సరోజ విసుగ్గా.

"నాకు వాచీ కావాలంటాను. తెలిసిందా" అన్నాడు శేషగిరిరావు అసలు సంగతి బయటపెడ్తూ.

"మీరే అడగండి మా నాన్నవచ్చాక." అన్నది సరోజ విసురుగా లోపలికి వెళ్తూ.

ఇంతలో జానకమ్మ వచ్చి "ఏమిటమ్మాయ్. నాన్న అంటున్నావు -" అన్నది.

"ఏమీలేదమ్మా. మీ అల్లుడిగారికి వాచీ కావాలంట." అన్నది సరోజ.

జానకమ్మ రాఘవయ్యగారు వచ్చాక వాచీ సంగతి చెప్పింది.

రాఘవయ్యగారు "ఆ......!!" అంటూ అక్కడే కూలబడ్డారు.